నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, మంగళవారం 2 జూలై 2024 VIKARABAD

## అక్రమాలపై ఉక్కుపాదం



మీడియాతో మాట్లాడుతున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

**కొత్త చట్టాల అమలు, అవగాహనపై దృష్టి**
**తాండూరులో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తాం**
**వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి**

తాండూరు, జూలై 1: జిల్లాలో అక్రమాలు, అన్యాయాలపై ఉక్కుపాదం మోపుతామని వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాండూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టాల అమలుతో పాటు వాటిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023, భారతీయ సాక్ష్య అధినియన్-2023 చట్టాలపై ఈ నెల 10వ తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని 14 బృందాలతో 600 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. నిషేధిత గుట్కా, మట్కాపై కూడా ఉక్కుపాదం మోపుతామన్నారు. తెలంగాణ-కర్ణాటక సరిహద్దుల్లో తనిఖీల కోసం ప్రత్యేక బృందాలు ఉంటాయన్నారు. జిల్లాలోని ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. తాండూరులో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇప్పటికే మంజూరైందని, వెంటనే స్థలం చూసి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లోనే ఉంటా..
# ధైర్యంగా ఉండండి

**మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి**


బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల మండల నాయకులతో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

చేవెళ్లటౌన్, జూలై 1 : 'పార్టీ మారిన నాయకుల విషయంలో ఏ మాత్రం ఆలోచించాల్సిన అవసరం లేదు.. నేను బీఆర్‌ఎస్‌లోనే ఉంటా.. చివరి శ్వాస వరకూ కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తా.. ధైర్యంగా ఉండండి..' అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం చేవెళ్ల మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే సబితారెడ్డిని నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ ఉన్న కార్యకర్తలతోనే బీఆర్‌ఎస్ పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. పార్టీ నుంచి ఒక్కరు పోతే పది మంది నాయకులను పార్టీ తయారు చేస్తుందన్నారు. ఎవ్వరూ అధైర్య పడవద్దని, 15 రోజులకోసారి నేను చేవెళ్లకు వస్తానన్నారు. ఏ అవసరమొచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎవ్వరికీ తెలియకుండా వెళ్లి పార్టీ మారినా వచ్చిన నష్టమేమీ లేదన్నారు. మనమంతా సైనికుల్లా పని చేసి కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల మాజీ చైర్మన్ నారాయణ, చేవెళ్ల మాజీ ఎంపీపీ మంగళి బాల్‌రాజ్, మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, నరహరిరెడ్డి, జంగారెడ్డి, ప్రభాకర్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, మాజీ డైరెక్టర్లు వెంకటేశ్, చందు, గని, ఎంపీటీసీ రవి, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, నాయకులు మాధవ గౌడ్, గుడిపల్లి శేఖర్‌రెడ్డి, నర్సింహులు, మల్లేశ్, మహేందర్ పాల్గొన్నారు.

# నిరుద్యోగుల నిరసనల వెల్లువ

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ధర్నాలు.. కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం**
**వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్**



బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నిరుద్యోగుల ఐకాస నాయకులు

వికారాబాద్ /బడంగ్‌పేట, జూలై 1 : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగుల కోసం గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3ద్వారా ఉద్యోగాల భర్తీ, మెగా డీఎస్సీ వేస్తామని హామీలిచ్చి ఇప్పుడు మాటమార్చడంపై నిరుద్యోగులు కన్నెర్ర చేశారు. సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట, వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో నిరుద్యోగులు ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. నిరుద్యోగుల ఓట్లతో గెలిచిన బల్మూరి వెంకట్ డౌన్ డౌన్, గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న మోతీలాల్ ఆరోగ్యం క్షీణిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వ మొండివైఖరి నశించాలి అంటూ నినాదాలు చేశారు. మోసపూరిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను నమ్మి మోసపోయామన్నారు. మోతీలాల్‌కు ఏమైనా జరిగితే అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. వెంటనే గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లు జారీ చేయడంతోపాటు, పోస్టులు పెంచి మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీవో నం 46 ను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగ ఐకాస నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు కల్పించాలని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

# సాగు లెక్క పక్కాగా..



- రంగారెడ్డి జిల్లాలో మొదలైన వానకాలం పంటల సర్వే
- ఈ సీజన్‌లో పంటల సాగు అంచనా 2.94లక్షల ఎకరాలు
- అత్యధికంగా 1.77లక్షల ఎకరాల్లో పత్తి వేసే అవకాశం
- క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు
- గత ఏడాది ప్రయోగాత్మకంగా కేశంపేట మండలంలో ప్రయోగాత్మకంగా డిజిటల్ సర్వే
- ఈసారి ఇంకారాని ఆదేశాలు !

రంగారెడ్డి, జూలై 1(నమస్తే తెలంగాణ)ః సీజన్ల వారీగా వ్యవసాయ శాఖ పంటల నమోదు ప్రక్రియ (క్రాప్ బుకింగ్) చేపడుతుండగా.. ప్రస్తుత వానకాలం సీజన్‌కు సంబంధించి రంగారెడ్డి జిల్లాలో పంటల సర్వే మొదలైంది. వ్యవసాయ విస్తరణ అధికారుల ఆధ్వర్యంలో క్లస్టర్ల వారీగా సాగు చేసిన పంటల వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. గత ఏడాది ప్రయోగాత్మకంగా కేశంపేట మండలంలో డిజిటల్ సర్వేను ప్రభుత్వం నిర్వహించింది. ఈసారి డిజిటల్ సర్వేపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

### సర్వే కోసం పల్లెబాట..

పక్కాగా పంటల వివరాల లెక్కలు తీసేందుకు జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు పల్లెబాట పట్టారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారితోపాటు ఆరుగురు ఏడీఏలు, 22 మంది ఏవోలు, 83 మంది ఏఈవోలు గత కొద్దిరోజులుగా ఇదే పనిలో ఉన్నారు. రైతుల వారీగా సర్వే నంబర్లు, సాగు విస్తీర్ణం, ప్రధాన పంటలు, అంతర పంటలు, నీటి వసతి వివరాలతోపాటు యజమాని సెల్‌నంబర్, సంతకాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. పంట ఏ దశలో ఉంది? చీడ పీడలు ఏమైనా ఆశించాయా? పంట దిగుబడి ఎంత వచ్చే అవకాశం ఉంది! తదితర వివరాలను వివిధ దశల్లో నమోదు చేసేలా యాప్‌ను రూపొందించారు. ఎక్కడో కూర్చుని వివరాలు నమోదు చేయకుండా..తప్పనిసరిగా వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లి నమోదు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ సర్వే వల్ల అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను సమకూర్చడంతోపాటు పంట కొనుగోళ్ల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకునే అవకాశం కలుగుతున్నది.

### 2.94లక్షల ఎకరాల్లో పంటల సాగు..

ఈసారి వానకాలంలో 2.94లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేసే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. ఇందులో అత్యధికంగా 1.77లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేయనుండగా..ఆతర్వాత వరిని లక్ష ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నది. అయితే ఇప్పటివరకు పత్తిని 85వేల ఎకరాల్లో సాగు చేయగా..వరిని 46 ఎకరాల్లో వేశారు. మరో 8,477 ఎకరాల్లో నారుమడిని సిద్ధం చేసి ఉంచారు. మొక్కజొన్నను 17వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పంటల నమోదు ప్రక్రియను చేపడుతున్నారు.

### ఈసారి డిజిటల్ క్రాప్ సర్వే ఉండేనా..!

పంటల సాగు వివరాలు మరింత పక్కాగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేను నిర్వహిస్తున్నది. గత ఏడాది జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద కేశంపేట మండలాన్ని ఎంపిక చేసి సర్వే నిర్వహించారు. మ్యాపులను జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్), గ్లోబల్ పొజిషనింగ్(జీపీఎస్) సిస్టం ద్వారా పంటల వివరాలను సేకరించారు. ఈ పద్ధతిలో రైతు పొలం వద్దకు వెళ్లి జీపీఎస్ ద్వారా ఛాయాచిత్రాన్ని తీసి పంటల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

పంటల సాగు విస్తీర్ణం, పంటల ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టం వివరాల సేకరణ, తెగుళ్ల వల్ల జరిగే నష్టం, వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ డిజిటల్ సర్వే ద్వారా తెలుసుకోవచ్చు. అయితే ప్రస్తుత వానకాలంలో డిజిటల్ క్రాప్ సర్వేకు సంబంధించిన ఆదేశాలు ఇప్పటివరకు రాలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికైతే క్రాప్ బుకింగ్ సర్వేను యాప్ ద్వారా చేపడుతున్నామని వారు చెబుతున్నారు.

**జిల్లాలో ఇప్పటివరకు సాగు చేసిన పంటల వివరాలు**

| పంట | సాగు అంచనా (ఎకరాల్లో) | ఇప్పటివరకు సాగైంది (ఎకరాల్లో) |
|---|---|---|
| వరి | 1,00,608 | 8,523 |
| జొన్న | 13,476 | 2,232 |
| మొక్కజొన్న | 68,549 | 17,770 |
| కందులు | 29,227 | 2,022 |
| పత్తి | 1,77,735 | 85,610 |
| ఇతర పంటలు | 5,331 | 11,924 |

# ఇంటిల్లిపాది.. ప్రజావాణికి వచ్చి..

**భూమిని కబ్జా చేశారంటూ కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు**

- పిల్లలతో కలిసి ఆవరణలోనే సహపంక్తి భోజనాలు
- అంతారం తండావాసుల వినూత్న నిరసన
- అధికారుల చుట్టూ తిరిగినా ఫలితంలేదని వ్యాఖ్య
- భూసమస్యలపై ప్రజావాణిలో పెరుగుతున్న ఫిర్యాదుల వెల్లువ
- వికారాబాద్ జిల్లాలో పెండింగ్‌లో సుమారు 10 వేల ధరణి దరఖాస్తులు


ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వచ్చి కలెక్టరేట్ ఆవరణలో భోజనం చేస్తున్న ఒకే కుటుంబానికి చెందినవారు


వికారాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): తమ భూమిని కబ్జా చేశారని.. న్యా యం చేయాలని డిమాండ్ చేస్తూ తాండూరు మండలంలోని అంతారం తండావాసులు సుమారు 50 మంది వినూత్న నిరసన తెలిపారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇంటిల్లిపాది సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బైఠాయించారు. పిల్లలతో కలిసి కలెక్టరేట్ ఆవరణలోనే వారు భోజనం చేసి నిరసన తెలపడం జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారింది. ప్రజావాణి కార్యక్రమానికి 178 మంది ఫిర్యాదులను అందజేయగా, వాటిని సత్వరమే పరిష్కరించాలని వివిధ విభాగాల అధికారులను కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యనూ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఏండ్లుగా సాగు చేసుకుంటున్న తమ పట్టా భూమిని ఇతరులు కబ్జా చేశారని.. న్యాయం చేయాలని తాండూరు మండలంలోని అంతారంతండాకు చెందిన తౌర్యానాయక్, హెర్యానాయక్ కుటుంబానికి చెందిన సుమారు 50మంది కుటుంబ సభ్యులు కలెక్టరేట్ ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బైఠాయించి నిర సన తెలిపారు. తమ పేరుతో ధరణిలో సర్వేనంబర్ 136లో 9.14 ఎకరాల భూమి చూపుతున్నా కబ్జాదారులతో కలిసి పోలీసులు తమ భూమిలోకి వెళ్లనివ్వడంలేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయా లని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. న్యాయం జరిగే వరకు కలెక్టరేట్‌లోనే బైఠాయిస్తామని తమ గోడును మీడియాకు చెప్పుకొన్నారు. అయితే ఈ విషయమై జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను సంప్రదించగా.. అంతారంతండా భూసమస్య సివిల్ కోర్టు పరిధిలో ఉన్నదని, కోర్టు ఆదేశాల మేరకు వారు వ్యవహరించాలన్నారు.

### భూ సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ..

భూ సమస్యలపై ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువలా వస్తున్నాయి. ప్రతి సోమవారం ప్రజావాణికి వందల సంఖ్యలో భూసమస్యలను పరిష్కరించాలంటూ ధరణి దరఖాస్తులపై రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. భూ సమస్యలపై తహసీల్దార్లు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులు కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. అయితే ధరణి ఆపరేటర్లు చేసిన తప్పిదాలతో రైతులు ఇంకా కష్టాలు పడుతున్నారు. ధరణి దరఖాస్తుల్లో అధిక మొత్తంలో ఆర్‌ఎస్‌ఆర్, రైతులకు ఉన్న భూమి కంటే ఎక్కువ లేదా తక్కువ భూమి ఉన్నట్లు ధరణి ఆపరేటర్లు తప్పుగా ఎంట్రీ చేయడంతో ఆర్‌ఎస్‌ఆర్ సమస్య ఉత్పన్నమై.. దాని పరిష్కారానికి రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పాత రికార్డుల ప్రకారం సంబంధిత సర్వేనంబర్లో ఏ రైతుకు ఎంత భూమి ఉందనే వివరాలను తెలుసుకొని ఆర్‌ఎస్‌ఆర్ సమస్యను పరిష్కరించొచ్చు.. కానీ, ధరణిలో ఎంట్రీ అయిన వివరాలను ప్రామాణికంగా తీసుకొని ఆర్‌ఎస్‌ఆర్ సమస్య పరిష్కారానికి ముందుకు వెళ్లడంపై విమర్శలు వస్తున్నాయి. అయితే ఓ రైతు పేరిట ఎక్కువ భూమి ఉన్నట్లు ధరణిలో ఎంట్రీ కావడంతో గుర్తించడం పెద్ద కష్టంగా మారడంతోపాటు సంబంధిత రైతు సహకరించకపోవడంతో ఆర్‌ఎస్‌ఆర్ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆర్‌ఎస్‌ఆర్ సమస్య పరిష్కారానికి ధరణి పోర్టల్‌లో ఆప్షన్ ఇవ్వాల్సిన అవసరం ఉందని రెవెన్యూ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ధరణి ఆపరేటర్ల తప్పిదంతో పట్టా భూములూ అసైన్డ్, భూదాన్, వక్ఫ్ భూములుగా తప్పుగా ధరణిలో ఎంట్రీ కావడంతో ఏండ్లుగా ఆఫీసుల చుట్టూ రైతులు తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదు. అసైన్డ్‌గా తప్పుగా ఎంట్రీ అయిన సంబంధిత భూమి..పట్టా భూమి అని తహసీల్దార్లు రిపోర్టు ఇచ్చి.. కలెక్టర్లు ఆమోదం తెలిపినా సీసీఎల్‌ఏ అధికారులు ఆ ఫైళ్లను పెండింగ్‌లోనే పెడుతున్నారు. సీసీఎల్‌ఏలో రిపోర్టు ఆధారంగా కాకుండా డబ్బులను పరిగణనలోకి తీసుకొని టీఎం-33 దరఖాస్తులను పరిష్కరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా డిజిటల్ సైన్ దరఖాస్తులూ అధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 10 వేల వరకు ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడం గమనార్హం.


### కలెక్టర్ స్పందించి పరిష్కరించాలి..



మా నాన్న పేరుపై పట్టా ఉండి ధరణిలో సర్వే నంబర్ 136లో 9.14 ఎకరాల భూమి ఉన్నది. గత 4,5 సంవత్సరాలుగా మా భూమిలో ఇతరులు కబ్జా చేశారు. మా భూమిలోకి మమ్మల్ని రానివ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ విషయం కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకపోయింది. కుటుంబ సభ్యులం సద్ది కట్టుకుని వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించాం. ఈ సారి మా సమస్య తీరేవరకు కలెక్టరేట్ కార్యాలయం వద్దనే ఉంటాం.

**- లక్ష్మణ్, భూ బాధితుడు, తాండూరు**

### నా భూమిని ఇప్పించండి..



మర్పల్లి మండలం కొత్లాపూర్ గ్రామం. గత 10 సంవత్సరాలుగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా. నా పేరుపై 188/అ/1/1/2లో 15 గుంటల భూమి ఉన్నది. ఆ భూమి 10 ఏండ్ల కింద 14 గుంటల భూమి వేరే వారి పేరుపై పడగా, నా పేరుపై ఒక్క గుంటే ఉన్నది. కార్యాలయాల చుట్టు తిరిగినా పరిష్కారం కాలేదు. సర్వే చేసి నాకు రావాల్సిన భూమిని అప్పగించాలని కోరుతున్నా. నా సమస్యను కలెక్టర్‌కు విన్నవించుకుందామని ప్రజావాణి కార్యక్రమానికి వచ్చా. నా భూమి నాకు కావాలి.

**- ఢిల్లీ బుచ్చయ్య, కొత్లాపూర్, మర్పల్లి**